# కలిసివచ్చినకాలం

: రచన :
శ్రీ. కలగ
నీలకంఠేశ్వర రావు.

'ఇంతటితో నీ రాజుపనిసరి'

ఆశ్చర్యపోయేను నిజమే, నా రాజుని ఎటు సేవ్ చేద్దామన్నా ఆస్కారమే లేదు. చుట్టూ రాక్షసుల్లా శ్రీధర్ పావులిన్నీ వున్నాయి. నాలో ఈర్ష్య రగిలిింది. కోపంతో బల్లపైనున్న పావులన్నిటినీ చెల్లాచెదరుగా చేసాను.

'అదే వద్దంటాను. ఎందుకా ఈర్ష్య? ఆట సరిగ్గా రాని నువ్వు, నాతో ఆడతానని పందెం కట్టేవుగా?' అన్నాడు శ్రీధర్ నాచెవి మెలిపెడుతూ.

'అవును నాకు ఆటరాదని తెలిసుండి నా పావుల్ని ఎక్కడ సేవ్ చేసుకోవాలో చెప్పవుకాదు.' కోపంతో అతనిచేతిని విసిరి కొట్టేను.

'వసుంధరా! నీపిచ్చిగానీ, చదరంగపు ఎత్తులు ఒకరు చెబితే వచ్చేవికావు. మనంతట మనమే నేర్చుకోవాలి. సరే, ఆ పావుల్నితీసి డబ్బాలో వెయ్యి. బల్లని మంచంక్రింద పెట్టు. అమ్మచూసిందంటే మన ఇద్దరిపని సరి.' సిగరెట్టు విప్పుతూ అన్నాడు శ్రీధర్.

శ్రీధర్ రేడియో ఆన్ చేసేడు. ద్వారం వెంకటస్వామిగారి వయోలిన్ వాద్యం కమ్మగా రాసాగింది. తన్మయత్వంతో వాలుకుర్చీలో కూర్చొని వింటున్నాడు.

'అన్నా' సిలోన్ స్టేషన్ వెయ్యవేం? ఎప్పుడు చూసినా హైదరాబాద్, విజయవాడ స్టేషన్లే వేస్తావు. వెధవ సంగీతం ముందా స్టేషను మార్చు.' అన్నాను.

'హిందీ పాటలకేనా? ఇంట్లోవుంటావుగా ఎప్పుడైనా వినవచ్చు అందులోనూ, ఈ రోజుల్లో హిందీ సినిమాలు కుక్క గొడుగుల్లా విడుదల అవుతునే వున్నాయి.'

'లేదు వెధవ తెలుగుసినిమాలే అలా విడుదల అవుతున్నాయి.'

అంతే! సీరియస్ లేచేడు శ్రీధర్. 'చెల్లీ! ఆఖరుసారిగా చెబుతున్నాను. ఇకముందు తెలుగుసినిమాలపై నావద్ద చెడ్డగా మాట్లాడితే జాగ్రత్త' అన్నాడు.

'అదంతా నాకనవసరం ముందు నువ్వు సిలోన్ పెడతావా లేదా?'

'నేను రేడియో వద్దనుండగా 'హైదరాబాద్' స్టేషనునుండి నీడిల్ కదిలేది కల్ల.'

'ఛీ! మొండి మనిషి' అంటూ కోపంతో బయటకు వచ్చేను.

సోఫాలో కూర్చొని బోటనీ పుస్తకం తెరిచాను. బోధపడితే ఒట్టు. చదరంగపుటాటలో శ్రీధర్‌తో ఓడిపోవటంవల్ల మనస్సు చికాకుతో నిండిపోయింది.

'క్రిష్ణమూర్తిగారి ఇల్లు ఇదేనాండి?'

తిరిగి చూసాను. వీధిగుమ్మంవద్ద ఎనిమిదేళ్ళకుర్రాడు చేతిలో సంచిపట్టుకొని నిలుచున్నాడు. ఉంగరాలు తిరిగినజుత్తు, గుండ్రని ముఖం, పొట్టినిక్కరూ, షర్టుతో అందంగా ముద్దొస్తూ కనిపించేడు.

'ఎవరు కావాలి?' అన్నాను.

కానీ వాడు నామాటలు వినిపించుకోలేదు. ప్రక్కనే టేబులుపైనున్న బుద్ధవిగ్రహాన్ని చేత్తోపట్టుకొని తదేకంగా పరిశీలిస్తున్నాడు.

'ఇదిగో బాబూ! నిన్నే.' అన్నాను కాస్త గట్టిగా.

'క్రిష్ణమూర్తిగారి ఇల్లు ఇదేనా' అన్నాడు.

'కాదు. ఇది క్రిష్ణారావుగారిల్లు.'

'మరి క్రిష్ణమూర్తిగారిల్లు మీకు తెలుసా?'

'లేదు. ఈ వీధిలో ఆ పేరుగలవారెవ్వరూ లేరు' అన్నాను.

'మరెలా క్రిష్ణమూర్తిగారిల్లని మా అక్క చెప్పింది. ఎలా వెళ్లటం?' విచార వదనం పెట్టేడు.

మా మాటలు విని శ్రీధర్ గదినుండి బయటకు వచ్చాడు.

'ఇదిగో బాబూ! ఇలా రా' అన్నాడు.

ఆ కుర్రవాడు శ్రీధర్ దగ్గరగా వెళ్ళాడు.

'నీకు క్రిష్ణమూర్తిగారిల్లు కావాలిగదూ?'

'అవునండి మీకు తెలుసా? ఆతృతతో అడిగాడు.

'తెలుసు. ఈ వీధినుండి ముక్కుసూటిగా పోయి ఎడమప్రక్క తిరుగుతే ఒక సందు వస్తుంది. ఆ సందులో ఒక మఱ్ఱిచెట్టుంది. దానికెదురుగా ఒక కిళ్లీ కొట్టుంది. ఆ కొట్టుకి నాలుగిళ్ల తరువాత ఒక పసుపురంగు మేడ వస్తుంది. ఆ మేడకేదురుగా నున్నదే నీకు కావలసిన ఆ క్రిష్ణమూర్తిగారి ఇల్లు.'

శ్రీదర్ చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. నోట్లో చిటికినవ్రేలు పెట్టుకొని ఒక్కక్షణం ఏదో ఆలోచిం

చేడు. 'సరే మీరు చెప్పిన దారమ్మటే వెళతాను అని వెనక్కు తిరిగాడు.'

'చూడబాబు.' అన్నాడు శ్రీధర్.

'ఏమిటండి?'

'ఈ సంచి నీదేగదూ?'

'అవును.'

'మరి రెండవ చేతిలోనున్న ఆ విగ్రహం?'

అంతవరకు వాడికి చేతిలో విగ్రహం వున్న ఆలోచనే లేదు. శ్రీధర్ చెప్పటంతోనే 'ఇది మీదేనండీ?' అంటూ దాన్ని టేబులుపై పెట్టి వెళ్ళిపోయాడు.

'ఎందుకు వాడితో అబద్ధాలు చెప్పావు' అన్నాను.

శ్రీధర్ నావేపు తలెత్తిచూసేడు. 'నీకు కష్టంగా వుందా?' అన్నాడు.

'నోర్మూయ్! పాపం ఆ పసివాడు నువ్వు చెప్పిన మాటలు విని మోసపోతాడు. నువ్వు చెప్పిన ఇల్లు అదే అనుకొని భ్రమపడతాడు.' అంటూ జాలి కనపరచాను.

'మించిపోలేదు. కావలిస్తే నువ్వెళ్ళి వాడితో చెప్పిరా.'

'ఛీ! ఐ. ఏ. ఎస్. ప్యాసయినవాడవి ఆపాటి జ్ఞానం వుండక్కర్లా? ఈ చలిలో వాడిని బాధపెట్టటం న్యాయమేనా?' అంటూ శ్రీధర్ వేపు కోపంతో చూశాను.

'ఇదీ ఒక చలేనా? సరిహద్దుల్లోనున్న సైనికులు రాత్రనక, పగలనక దేశరక్షణకై ఇంతకన్నా ఎక్కువ చలిని భరిస్తున్నారు. తెలుసా?'

'నీతో వాదించుకు కూర్చోటానికి సమయంలేదు. రికార్డు రాసుకోవాలి' అంటూ నా గదిలోనికి వెళ్ళి తలుపులు మూశాను.

× × ×

మరునాడు ఉదయం ఏడుగంటలైంది.

శ్రీధర్ తన గదిలో కూర్చొని తెలుగు వార్తలు వింటున్నాడు. నేను అప్పుడే కోసుకొనివచ్చిన సన్న జాజులను మాలగా గుచ్చుతున్నాను. అమ్మ వంటింట్లో ఏదో పని చేసుకుంటుంది. నాన్నగారు అప్పుడే సెక్రటరీ. వెళ్ళారు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

'ఎవరండీ ఇంట్లో?'

కమనీయమైన ఆ కంఠం విని తలెత్తి చూశాను

Grams: "SHIVAJITEX" Phone No. 3616

ఎల్లప్పుడూ మీ నమ్మికకు పాత్రమైన 'శివాజీ' గుర్తుగల టవల్సునే వాడండి




**T. MARIMUTHU**
HANDLOOM WEAVING FACTORY
SELLUR :: MADURAI-2.

టి. మారిముత్తు.
హేండ్‌లూమ్ వీవింగ్ ఫ్యాక్టరీ.
సెల్లూర్ : : మదురై-2

ద్వారంవద్ద పదెనిమిదేళ్ల అమ్మాయి కనబడింది. పాల రాతిలా మెరసిపోతున్న శరీరం. పిరుదులవరకూ సన్న వాలు జడ. ఆకుపచ్చని సిల్కు చీర. ఎర్రని సిల్కు జాకెట్టు. దివినుండి దిగి వచ్చిన దేవకన్యలా వుంది.

'ఎవరు కావాలండీ?' దగ్గరగా వెళ్ళి అడిగాను.

'రాత్రి మా తమ్ముడికి తప్పుడు మార్గం చెప్పినది మీరేనా' కోపంతో అడిగింది.

'కాదండి.' అంతకన్నా ఎటువంటి సమాధానం చెప్పాలో తోచలేదు.

'మరింకెవరు?' కోపంతో ఇంటి పైకప్పు ఎగిరిపోయేలా అరచింది. అంత అందమైన అమ్మాయి ఆ కోపంలో భద్రకాళిలా కనపడింది.

'మరే...మరి...అబ్బే! ఎవరూ లేదండీ. అసలు మీ తమ్ముడెవరో నాకు తెలీదండీ' అన్నాను.

బయట నిల్చున్న అమ్మాయి ధైర్యంగా లోనికి వచ్చింది.

'నిజంగా మా తమ్ముడెవరో నీకు తెలీదా? '

'నిజమండీ.'మీ తమ్ముడెవరో నాకు తెలిసే తెలీదు.

'సరే!' అంటూ ఆ అమ్మాయి బయటకువెళ్లి నిన్న మా ఇంటికి వచ్చిన కుర్రాడిని రెక్క పుచ్చుకు వచ్చింది. ఆశ్చర్యంతో నానోట మాట రాలేదు.

'మాట్లాడరేం? వీడు మీకు తెలీదా?' అంది.

'తెలుసు' బెదురుతూ జవాబు చెప్పాను.

'ఏం శీనూ! ఈ అమ్మాయేనా నీకు క్రిష్ణమూర్తిగారింటి త్రోవ చెప్పింది?' అని ఆ కుర్రవాడిని అడిగింది.

చేతిలోనున్న ఐస్‌క్రీము తింటూ వాడు ఆమెకు సమాధానం చెప్పలేదు.

'మాట్లాడవేంరా?' అంటూ ఆమె వాడి వీపుమీద చేత్తో ఒక్కటి అంటించింది.

'కాదే అక్కా! అదిగో ఆయన' అన్నాడు నా వెనక వ్రేలితో చూపుతూ.

అటువేపు తిరిగాను. ఆశ్చర్యం! శ్రీధర్ ఎప్పుడు తన గదినుండి వచ్చాడో. సోఫాలో కూర్చొని ఏదో వీక్లీ చదువుతున్నాడు.

ఆమె శ్రీధర్ వద్దకు వెళ్ళి 'మిమ్మల్నే' అంది.

శ్రీధర్ చేతినున్న పుస్తకంనుండి దృష్టి మరల్చలేదు.

'మాట్లాడరేం?' అంటూ ఆమె శ్రీధర్ చేతిలోనున్న పుస్తకాన్ని తీసి ఒక మూలకు విసరివేసింది.

'నా పేరు శ్రీధర్. మీ పేరో?' అన్నాడు శ్రీధర్.

'మీ కనవసరం' అంది ఆమె.

'ఇదిగో శీనూ! ఇలా రా.' అంటూ శ్రీధర్ శీనుని పిలచాడు.

గత 54 సంవత్సరములనుంచీ
ప్రసిద్ధిచెందినది.




మంచి ఆకుతోను, శ్రేష్ఠమైన పొగాకుతోనూ
తయారించిన
సమద్, జాడీ & సాదా
బీడీలనే వాడి, ఆనందించండి.
తయారించువారు
సమద్ బీడీ ఫేక్టరి
వేలూరు (N. A.)
ఫోన్ : ఆఫీసు 246. రెసిడెన్సు 124.

శీను శ్రీధర్ వద్దకు వెళ్ళి నిలబడాడు.

'మీ అక్క పేరేమిటి.' శ్రీధర్ అడిగేడు.

'హీహీహీ...శ్యామల' అంటూ నవ్వాడు శీను.

'ఆహా! ఎంత అందమైన పేరు, రూపానికి తగ్గ పేరు.

'షటప్! ఆఖరుసారిగా చెబుతున్నాను. ఇకముందు మాతమ్ముడికి అటువంటి తప్పుడు త్రోవలు చెప్పి తిప్పలు పెడితే నేను మంచిదాన్ని కాను.' అంటూ రౌద్రాకారం దాల్చింది శ్యామల.

'భ భ మీరు చాలామంచివారు. మిమ్మల్ని చూస్తేనే తెలుస్తుంది. ఏమంటారు?' అన్నాడు శ్రీధర్.

చూస్తూ కూర్చొంటే పరిస్థితి తారుమారవుతుందని గ్రహించాను. శ్యామలవద్దకు వెళ్ళి 'క్షమించండి. ఏదో

పొరపాటున మా అన్నయ్య అలా చేశాడు.' అన్నాను.

'ఓ!, ఆయనగారి చెల్లెలివా? అయితే మీరిద్దరూ కలిసే ఈనాటక మాడారన్నమాట ఏవమ్మాయ్? మగవాడు, ఆయనకు బుద్ధిలేకపోతే ఆడదానివి నీకేనా వుండొద్దూ?'

'అందులో నా తప్పేంలేదండీ? అన్నాను.

'ఎంత సంగనాచివమ్మా. మొదట్లో మాతమ్ముడెవరో తెలీదన్నావు. ఇప్పుడు క్షమార్పణలు చెబుతున్నావా?'

శ్యామల కేకలువిని వంటింట్లో పనిచేసుకుంటున్న అమ్మ అక్కడికి వచ్చింది.

'జాగ్రత్త! ఇకమీద ఇలాంటి పనులు చేశారంటే మర్యాదా దక్కదు.' అంటూ శ్యామల తన తమ్ముడిని తీసుకొని వెళ్లిపోయింది.

'ఏమిటే వసూ? ఎవరా అమ్మాయి? ఎందుకలా కేకలువేస్తుంది?' అంటూ అమ్మ ఆశ్చర్యం కనపరచింది.

'ఇదిగో, నీ సుపుత్రుడు శ్రీధర్ ప్రభావం' శ్రీధర్ వేపు కసిగా చూస్తూ అన్నాను.

క్షణంసేపు ఏదో ఆలోచిస్తున్నవాడుగా కనబడ్డాడు శ్రీధర్ వెంటనే సోఫాలోంచి లేచి బయటకు వెళ్లటానికి చెప్పులు తొడుక్కున్నాడు.

'ఎక్కడికిరా అబ్బాయ్. కాఫీ తాగి వెళుదువుగాని కాస్త ఆగు.' అన్న అమ్మమాటలు వినిపించుకో[illegible] బయటకువెళ్ళిపోయాడు.

'ఏమిటిదంతా? నాకేం బోధపడటంలేదు. ఆపిల్ల ఎవరే వసూ?' అంది మా అమ్మ.

రాత్రి జరిగినవిషయమంతా అమ్మకి చెప్పి శ్యామల రావటానికి కారణం చెప్పాను.

అంతావిని అమ్మ నిట్టూర్చుతూ 'ఏమిటో, వీడు రోజు, రోజూ చిన్నపిల్లాడవుతున్నాడు,' అంది.

'చిన్నపిల్లాడుకాదు. అదంతా మొండితనం.'

'సరే ఏదో జరిగిందిగానీ, వంటింట్లో కాఫీవుంది. శ్రీధరం వస్తే వాడూ, నువ్వూ తాగండి. నేనలా దేవాలయానికి వెళతాను.' అంది అమ్మ.

అమ్మ దేవాలయానికి వెళ్లిన పదినిముషాలకు శ్రీధర్ వచ్చాడు.

'ఎక్కడికి వెళ్లావు?' కాఫీ కప్పు అందిస్తూ అడిగాను.

'ఆ అమ్మాయికోసం.' అన్నాడు శ్రీధర్.

'కనబడిందా?'

'ప్చ్. లేదు. నేను వెళ్లటం ఆలస్యం అయింది.' కాఫీ తాగుతూ అన్నాడు.

'మళ్లీ ఎందుకు పోట్లాటకా?'

'కాదు.'

'మరి?'

'నా క్షమార్పణ చెప్పటానికి నేను చేసిందితప్పుగా.' కప్పుని బల్లపై పెడుతూ శ్రీధర్ అన్నాడు.

ఆశ్చర్యపోయాను. మొదట్లో శ్యామలను మొండి జవాబులతో విసిగించినవాడు. తిరిగి క్షమార్పణ చెప్పటానికి సిద్ధపడ్డాడు. అందులో ఐ. ఏ. ఎస్ ఫస్టు. క్లాసులో పాసయిన శ్రీధర్ తనకు తానే ఒక అమ్మాయికి క్షమార్పణ చెప్పటానికి సంకోచించలేదు.

\+ + +

శ్రీధర్ కొత్తగా ఐ. ఏ. ఎస్. పాసయిననాడు నాకు మంచి చీర కొంటానని మాట ఇచ్చాడు. తరువాత ఆ విషయం మా ఇద్దరిలో ఎవ్వరికీ గుర్తు రాలేదు. ఒకనాడు అది గుర్తుకొచ్చి శ్రీధర్‌తో చెప్పాను.

'అవును వసుంధరా! నాకు జ్ఞాపకమేలేదు. సాయంకాలం షాపుకు వెళదాం. నీకు నచ్చిన చీర తీసుకొందువుగాని సరేనా?' అన్నాడు.



ఎల్లప్పుడు మీ నగలకు......
= సాయి స్పెషల్ =
వజ్రములనే ఉపయోగించండి.
అవి మీ నగలకు ప్రకాశమునూ, విలువనూ ఇస్తుంది.
షరాపు వ్యాపారస్తులందరివద్దనూ దొరకును.
సాయి డైమండు కంపెని,
పెద్దబజారు, : : తిరుచిరాపళ్ళి-8.

సాయంకాలం నేనూ శ్రీధర్ బట్టల షాపుకి వెళ్లాము. షాపు యజమాని రాఘవయ్య మమ్మల్ని గౌరవంతో ఆహ్వానించి రకరకాల చీరలు మా ముందు వేసాడు. అరగంటపాటు వాటిని పరిశీలించి నాకు నచ్చిన గులాబి రంగు బిన్నీ సిల్కు చీర తీసుకున్నాను.

ఇంతలో పెళ్లివారి గుంపులావున్న పదిమంది అమ్మాయిలు షాపులోనికొచ్చారు. అంతవరకు నిశ్శబ్దంగా వున్న షాపు చేపల బజారులా తయారయింది. వారు గూడా చీరలే చూస్తున్నారు. నేను శ్రీధర్ టెర్లిన్ క్లాతు సెలెక్ట్ చేస్తుంటే చూస్తున్నాను. అందులో ఒక అమ్మాయి షాపు యజమానితో ‘ఆ చీర నేను సెలెక్ట్ చేసేను. ముందు ఇస్తానని తరువాత అమ్మేసానని అంటున్నావేమిటి?’ అంటూ కేకలు వేస్తుంది. ఆ కంఠం ఎక్కడో విన్నట్టనిపించింది.

‘వసుంధరా! కొంపతీసి నీకు నచ్చిన చీర కాదుగదా? కాస్త ఆగు కనుక్కొని వస్తాను.’ అంటూ శ్రీధర్ వెళ్లి రెండు నిముషాల్లో మళ్ళీ నావద్దకు వచ్చాడు.

‘అనుకున్నంతా అయింది. నీకు నచ్చిన చీరే ఆ అమ్మాయికీ నచ్చింది. నువ్వు మరేదేనా తీసుకో. లేకపోతే కొంప మునుగుతుంది’ అన్నాడు.

‘అదెలా? ముందుగా సెలెక్ట్ చేసింది నేను. ఆ అమ్మాయి ఎలా తీసుకుంటుంది?’ అన్నాను.

‘నువ్వు కాదంటే పెద్ద గలాటా జరుగుతుంది. ఆ అమ్మాయి ఎవరనుకున్నావు?’

‘ఎవరైతే నాకేం. ఆమె ఆ చీర ఎలా తీసుకుంటుందో చూస్తాను.’ అంటూ అక్కడికి వెళ్ళాను.

‘ఆ చీర ముందుగా నేను సెలెక్ట్ చేశాను. ఎవరూ దాన్ని తీసుకోటానికి వీల్లేదు.’ అని వారితో అన్నాను.

‘నువ్వు సెలెక్ట్ చేసావో లేదో నాకనవసరం. షాపువాడు ముందు ఇస్తానని ఎందుకు మాట ఇవ్వాలి?’ అంటూ ఒక అమ్మాయి ముందుకు వచ్చింది. ఆశ్చర్యం. ఆమె శ్యామల.

‘అమ్మా! ఏదో పొరపాటున చీర ముందే సెలెక్ట్ అయిందని తెలిసికూడ మీతో చెప్పాను క్షమించండి. ముందుగా ఆ చీర కొన్నది ఈమె.’ అంటూ రాఘవయ్య నన్ను చూసాడు.

శ్రీధర్ నా వద్దకు వచ్చి ‘వసుంధరా! తగువెందుకు నువ్వు ఇంకో చీర తీసుకో. రాఘవయ్యగారూ! చీర ఆవిడకే ఇవ్వండి. మేం ఇంకోటి తీసుకుంటాం అన్నాడు.

శ్యామల నా వద్దకు వచ్చి ‘క్షమించు వసుంధరా! అనవసరంగా నిన్ను బాధపెట్టేను. ఆ చీర నువ్వే తీసుకో’ అంది.

‘నో, నో, మీరే తీసుకోండి. ఈ చీర మీకు నచ్చిందిగా’ అన్నాడు శ్రీధర్.

‘అదంతా మీకనవసరం. ఆ చీర నాకక్కరలేదు. మీ చెల్లెలిగారినే తీసుకోమనండి’ అంది. శ్రీధర్ పై. ఆమెకు ఇంకా కోపం పోలేదు.

(సశేషం)

‘కథాంజలి’లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాశినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులు కాదు. —సంపాదకుడు

(90వ పేజీ తరువాయి)

ఉన్నాయి. సింగిల్ కట్టింగ్, డబుల్ కట్టింగ్, ట్రిబిల్ కట్టింగ్, టేబిల్ కట్టింగ్, ఉలండ, కమలాపట్టు మొదలయినవి యీ పదతుల కిందికి వస్తాయి.

ఇమిటేషన్ వజ్రాలు యుద్ధకాలంలో కొద్దిగా తయారయి – రాను రాను సంఖ్యాముఖాన హెచ్చయ్యాయి. ఇవి అటు ధనవంతులకు, యిటు బీదవారికీ అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిశ్రమలో సుమారు యాభైవేలమంది పనివారు నిమగ్నులై ఉన్నారు. దీనిని మనం ఒక కుటీరపరిశ్రమ కింద జమకట్టవచ్చు; తక్కువ మూలధనంతో ఎందరో పనివారలకు యీ పరిశ్రమ భుక్తిని సమకూరుస్తోంది.

ఈనాడు కేరళ, రాజస్థాన్ ప్రాంతాలలో యీ రకమైన వజ్రాలు కొద్దిగా తయారవుతున్నాయి. భారీగా యివి తిరుచినాపల్లిలో తయారయి భారతదేశ మంతటికీ సరఫరా కాబడుతున్నాయి. కొంత సరుకు విదేశాలకు కూడా ఎగుమతి అవుతోంది. వజ్రాలు పొదగబడ్డ ఆభరణాలను కాంక్షించే వారందరు యీ కుటీర పరిశ్రమకు కేంద్రమయిన తిరుచిరాపల్లిని మరువరు. ఈ మానవ ప్రపంచంలో స్త్రీ జాతి ఉండేంతవరకు యీ రకమైన వజ్రాలకు గిరాకీ ఉంటుందనడంలో యే మాత్రం సందేహం లేదు.

Edited and Published by A.N. Raghavachar, No, 32, Krishnappa Naick Tank St, Madras-I
Printed by R. Bakthavachalu Bharathamatha Press. No. 39, Anderson St., Madras-1